# అన్వేషణ

మత్తుగా నిద్రపోయిన శాస్త్రజ్ఞుడు మెల్లగా కళ్ళు తెరిచాడు. కళ్ళు బాగా బరువుగా ఉన్నాయి. నేటి శాస్త్ర విజ్ఞానం తయారు చేసిన మేటి రకం మాదకద్రవ్యాలు తాగిన అతనికి నిషా ఇంకా తగ్గలేదు.

తనెక్కడ ఉన్నాడో అర్థం కాలేదు. అంతా అయోమయంగా ఉంది. మెల్లగా చుట్టూ చూశాడు.

ఉషస్సు అందించిన విస్కీ తాగిన రాత్రి తూలి పడిపోయింది. అతని తనువులాగే ఆమె ఒడి కూడా అక్కడక్కడా చెక్కుకుపోయింది. ఆ దెబ్బల నుంచి చిమ్మిన రక్తం ఎర్రమబ్బుగా పూర్వాంబరాన తెట్టు కట్టి ఉంది.

తను అక్కడికి ఎలా వచ్చాడో, ఆలోచించాడు శాస్త్రజ్ఞుడు. అధునాతనమైన భవంతిలో ఏసీ రూములో పవళించవలసిన తను ఇక్కడ రహదారిలో రాళ్ళ కుప్పల దగ్గరగా ఒరిగిపోవట మేమిటి? మానవత్వానికి, ధార్మిక చింతనకు ప్రతీకగా నిలిచిన ఆమె ఏదీ?

తమ ప్రయోగ శాలలో ఉండటం బాగా గుర్తుంది. కొన్నేళ్ళు కంప్యూటర్ల మధ్యన కంప్యూటర్‌గా పని చేసాడన్న సంగతి గుర్తుంది. అంతరిక్షంలో ఉపగ్రహాల్ని నిక్షేపించి వాటిని భూమి మంచే అదుపులో పెట్టగలిగే శక్తి సంపాదించాడన్నది కూడా గుర్తుంది. శాస్త్రవిజ్ఞానం అందించిన ఐశ్వర్యం, కడుపు నిండా తాగి ఆనందించాడన్నదీ గుర్తుంది. కానీ ఆ తర్వాత......

చల్లగా చిరుగాలి వీచింది. గాలితోపాటు వచ్చిన దుర్గంధాన్ని భరించలేక ముక్కు మూసుకున్నాడు. తప్పతాగిన తను కుళ్ళు కాలువ గట్టు మీద పడిపోయాడని, తన కాళ్ళు కుళ్ళునీళ్ళలో మునిగి ఉన్నాయని అపుడు గానీ అతనికి తెలియలేదు.

తన ఇల్లు ఎక్కడ ఉంది? తన కిష్టమైన పుస్తకాలు ఎక్కడ ఉన్నాయి? తన హృదయ స్పందనకు ప్రతీకయిన ఆమె ఎక్క...

ఉంది?

శాస్త్రజ్ఞుడు లేచాడు. రెండడుగులు వేశాడు. కాళ్ళు నొప్పిగా ఉన్నాయి. అయినా నడవక తప్పదు.

ఆమెని చూడాలి.

మూసుకపోయిన అతని మానవ కవాటాలలాగే, ఎదురుగా కనిపిస్తున దుకాణాల తలుపులు ఇంకా మూసే ఉన్నయి. సూర్యకిరణాలు, ఇంకా భూమి మీద పడటం లేదు.

ఓ టీ తాగితే బాగుంటుందని అనిపించింది, అతనికి. జేబులు తడిమి చూశాడు. శాస్త్రవిజ్ఞానం అందించిన వరం- డబ్బు పాకెట్ నిండా ఉంది.

బడ్డీ దగ్గర గుమికూడి టీ తాగే కూలీలు అతనివైపు ఆశ్చర్యంగా చూశారు. గౌరవ పూర్వకంగా దారి ఇచ్చారు.

"స్ట్రాంగ్ టీ!"

ఆ మాటలు పట్టించుకోలేదు టీ బడ్డీవాడు. పంచ నక్షత్ర హోటళ్ళలోనే టీ తాగే బాబులు తమ దుకాణంలో టీ తాగటం ఏమిటీ అనుకుని పనిలో మునిగిపోయాడు వాడు.

మరోసారి టీ ఇమ్మని అడిగాడు.

టీ తాగుతున్న అతన్ని చల్లగాలి తాకింది. హోటళ్ళలో టీ కన్నా ఈ టీ బాగుందని అనిపించింది.

టీ తాగుతూ కూర్చుంటే లాభం లేదు. ముందు ఆమెని చూడాలి.

కాళ్ళు ఈడ్చుకుంటూ నడిచాడు.

ఆమె ఎక్కడ కనిపిస్తుంది? ఇంటి దగ్గర కెళితే?

నాలుగడుగులు వేసి గుడి దగ్గరకు చేరుకున్నాడు. దేవాలయం దగ్గర బారులు బారులుగా నిలుచుని ఉన్నారు జనం. తలంటుపోసుకున్న ఆడవారు పూల సజ్జలలో కొబ్బరి కాయలతో నిలబడి ఉన్నారు.

ఆ రోజు కార్తీక సోమవారం అయి ఉండవచ్చని అనుకున్నాడు.

ఆ వరుసలో ఆమె ఉందా? జాగ్రత్తగా చూశాడు.

తలంటి పోసుకున్న ఉదయం తన కరిమబ్బుల కురులను విరబో-సుకుని నుదుటి మీద సూర్య తిలకం దిద్దుకుంటోంది.

ఆమె అక్కడ కనిపించలేదు. అయినా అక్కడ ఎలా కనిపిస్తుంది ఆమె? ఆమెలోని ధార్మిక చింతనని నరిపిపారేసింది అతనే కదా?

ఆమెకి దేవుని మీద నమ్మకం ఎక్కువ. పూజలన్నా, ఉపవాసా-లన్నా మక్కువ.

ఆమే కాదు అతని తల్లి కూడా అలాగే ఉండేది. కార్తీక సోమవా-రాలు ఉపవాసాలు చేసేది. పొద్దున్నే శివాలయానికి వెళ్ళేది. చిన్నప్పుడు అతను కూడా తల్లితోపాటు ఈశ్వరుని కోవెలకి వెళ్ళాడు. అప్పుడు అతను చాలా చిన్నవాడు. ఇంకా శాస్త్ర విజ్ఞానం సంపాదించలేదు. రోడ్డు మీద లారీలు, కార్లు పరుగెత్తేవి కావు. విద్యుద్దీపాలు లేవు.

దేవునికి మొక్కుకుంటే పుణ్యం వస్తుందని చెప్పేది తల్లి. పుణ్యం వచ్చిందో, లేదో తెలియదు గానీ, గుడికి వెళ్ళి వస్తే మనస్సుకు హాయిగా ఉండేది.

అతనిలోని శాస్త్ర విజ్ఞానం కొద్ది కొద్దిగా పెరిగింది. ఇంజనీరింగ్ చదివే రోజుల్లో అడిగాడు.

“ఎందుకమ్మా ఈ ఉపవాసాలు, ఈ నోములు?”

ఆమె స్తంభించిపోయింది. తను రూపమిచ్చి పెంచిన వాడు తన విశ్వాసాలనే ప్రశ్నిస్తున్నాడు.

“పాపం లేదు, పుణ్యం లేదు” అతను అన్నాడు. “ఆ మాట-కొస్తే దేవుడే లేడు.”

ఆమె చెవులు మూసుకుంది.

కంప్యూటర్ల కన్నా మిన్నగా పని చేసిన మానవ మస్తిష్కాలు ఉండటం వల్లనే మన ఇతిహాసాలు ఈ నాటికీ జనాల నోట్లో ఉన్నా-యని చెప్పాలని అనిపించింది గానీ ఆమె చెప్పలేదు.

అతని విజ్ఞానం రోజు రోజుకీ పెరిగింది. అధునాతనమైన భవం-

తిని విర్మించి ఆమెను అందులో ఉంచాడు. కళ్ళు మూసిన తల్లి మళ్ళీ అతనికి భార్యగా కనిపించింది. అవే నోములు! అవే ఉప-వాసాలు! అవే దాన ధర్మాలు. అతడు భరించలేకపోయాడు. శాస్త్ర మిచ్చిన 'షూ'తో ఆమెని తన్నాడు. ఆమెలో రూపుదిద్దుకుంటున్న మానవత్వపు భ్రూణం ఆ దెబ్బకి చచ్చిపోయింది. ఆమె ఏడుస్తూ గడప దాటింది.

ఆమె ఇప్పుడు ఎక్కడ ఉంటుంది?

ఇల్లు వచ్చేసింది. అది విశాలమైన ఇల్లు. తలుపులు తెరిచే ఉన్నాయి.

ఆత్రతతో ఇల్లంతా వెతికాడు అతను. ఆమె కనిపించలేదు. మళ్ళీ మళ్ళీ వెతికాడు.

అలసిపోయి వచ్చి ఏసీ ఆన్ చేశాడు. అది పని చేయలేదు. ఫాన్-వేసుకున్నాడు - అది తిరగలేదు. ఎండిపోయిన గొంతు తడుపుకుందా మని కుళాయి విప్పాడు - నీళ్ళు పడలేదు.

తను సాధించిన శాస్త్ర ప్రగతి తనని వెక్కిరిస్తున్నట్లు తోచింద అతనికి.

రోడ్డు మీద పడ్డాడు. అతనికి మనశ్శాంతి కావాలి. మనశ్శాంతి నిచ్చే ఆమె కావాలి.

ఆమె ఎక్కడ కనిపిస్తుంది?

అతను వెదికాడు. ఇంకా వెదుకుతూనే ఉన్నాడు.

* * *

(ఆంధ్రప్రభ వారపత్రిక 5-12-90 సంచికలో ప్రచురితం)